
సాక్షి కర్నూలు

గురువారం । 14 । డిసెంబర్ । 2023



సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు.



జీడీపీలోకి ఎల్లెల్సీ నీరు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)లోకి 20 రోజులుగా రోజుకు 260 క్యూసెక్కుల చొప్పున ఎల్లెల్సీ, 70 క్యూసెక్కుల చొప్పున 'హంద్రీ–నీవా' నీరు వచ్చి చేరాయి.



..భవితకు వెలుగు

వినియోగదారులు వృథాను అరికట్టి విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. ఈ మేరకు అవగాహన కల్పించేందుకు నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. IIలో▸

న్యూస్‌రీల్

సామాజిక బస్సు యాత్ర తేదీలు ఖరారు

కర్నూలు(రాజ్‌విహార్): ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే సామాజిక సాధికార బస్సు యాత్ర తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 17న కర్నూలు నగరం పాతబస్తీలో బస్సు యాత్ర, బహిరంగ సభ నిర్వహించనున్నారు. అలాగే 22న ఎమ్మిగనూరు, 30న నంద్యాల నియోజకవర్గాల్లో బస్సు యాత్ర చేపట్టనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక సాధికార బస్సు యాత్రలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులు



రాజవండి ఫయాజ్ అహ్మద్ నిజాప్



నాయక్ మహమ్మద్ షరీఫ్

కర్నూలు (రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీలో కర్నూలు జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు దక్కింది. ఆదోనికి చెందిన రాజవండి ఫయాజ్ అహ్మద్ నిజాప్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, కర్నూలుకు చెందిన డి.నాగరాజును కార్యదర్శిగా, ఎమ్మిగనూరుకు చెందిన నాయక్ మహమ్మద్ షరీఫ్‌ను సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమించినట్లు పేర్కొంది.

నలుగురికి గ్రేడ్‌-2 హెచ్‌డబ్ల్యూఓలుగా పదోన్నతి

కర్నూలు(అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న నలుగురు నాల్గో తరగతి సిబ్బందికి వారి అర్హతలు, సీనియారిటీని అనుసరించి గ్రేడ్‌-2 వసతి గృహ సంక్షేమాధికారులుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు పదోన్నతులు పొందిన నలుగురికి జిల్లాలో ఖాళీగా ఉన్న బీసీ బాలుర వసతి గృహాలకు హెచ్‌డబ్ల్యూఓలుగా నియమించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ పదోన్నతి పొందిన వారికి పోస్టింగ్స్ ఇచ్చారు. పదోన్నతులు పొందిన వారిలో ఈ వెంకన్నగౌడ్‌ను ప్యాపిలి, ఏ ఇక్బాల్‌ను ఎన్ రాచర్ల, బీ బసవరాజును చిన్నహోతూరు, కే నరసప్పను లొద్దిపల్లెకు నియమిస్తూ ఉత్తర్వులు అందించారు.

న్యాయవేదిక.. ప్రగతి వీచిక

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరుగులు పెడుతున్న అభివృద్ధి
- జగన్నాథగట్టుపై 270 ఎకరాల్లో జ్యుడీషియల్ సిటీ ఏర్పాటు
- నేషనల్ లా యూనివర్సిటీకి 150 ఎకరాల కేటాయింపు
- పారిశ్రామికరంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కీలక అడుగులు
- జయరాజ్ ఇస్పాత్, గ్రీన్‌కోతో పాటు 21 ప్రధాన కంపెనీల ఏర్పాటు
- అన్ని కంపెనీల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగ అవకాశాలు



కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్, ఓర్వకల్లు హబ్‌లో 10,900 ఎకరాలు ఏపీఐఐసీ సేకరించింది. శ్రీసిటీ తర్వాత 'సీమ'లో అభివృద్ధి చేస్తోన్న భారీ ఇండస్ట్రియల్ హబ్ ఇదే. జయరాజ్ ఇస్పాత్ స్టీలుప్లాంటు పనులు వేగంగా సాగుతున్నాయి. దీంతోపాటు సిగాచీ ఇండస్ట్రీస్, ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్‌తో పాటు మారుతి–సుజుకికి కూడా ఫార్మారంగంలో ప్రవేశిస్తోంది. వీటితో పాటు ప్రైమోపాలీప్యాక్(ప్లాస్టిక్ ఇండస్ట్రీ), బ్లాక్‌హ్యాక్, ఎక్సెల్ ఇమ్యూన్ లాజిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్(వెటర్నరీ ఫార్మా) భారీ ఆక్సిజన్ తయారీ ప్లాంట్‌తో పాటు మరో 13 బడా కంపెనీలు నిర్మాణాలు ప్రారంభించబోతున్నాయి.

సాక్షి ప్రతినిధి కర్నూలు: కర్నూలు జిల్లా పూర్తి దుర్భిక్షప్రాంతం. వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేసే ప్రాంతం. వర్షాలు రాకపోతే కరువుబారిన పడి పల్లెలు వలసెళ్లే పరిస్థితి. ఈ క్రమంలో జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇప్పటికే ఆడా(ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) పేరుతో ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాలను అభివృద్ధి చేస్తోంది. ఇదే క్రమంలో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఏకంగా రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలు, ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటోంది. మూడు రాజధానుల్లో భాగంగా కర్నూలును న్యాయరాజధానిగా అభివృద్ధి చేయాలని భావించింది. అయితే టీడీపీతో పాటు కొన్ని శక్తులు దీనికి తీవ్రస్థాయిలో అడ్డుతగులుతున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం చిత్తశుద్ధితో అభివృద్ధిని మాత్రం ఆపడం లేదు. ఇప్పటికే లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం నేషనల్ లా యూనివర్సిటీ, స్టేట్ క్యాజీ జ్యుడీషియల్ అండ్ లీగల్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటు చేస్తోంది. దీనికి ఇటీవలే 50 ఎకరాలను కేటాయించింది. ఇది వరకూ 100 ఎకరాలను కేటాయించింది. దీంతో 150 ఎకరాల్లో నేషనల్ లా యూనివర్సిటీ ఏర్పాటు కానుంది.

వేగంగా పారిశ్రామిక అభివృద్ధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు ఇండస్ట్రియల్ పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కర్నూలు, ఆదోని, డోన్‌తో పాటు నంద్యాలలో రెండు పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఇందులో కర్నూలు క్లస్టర్‌ను ప్రత్యేకంగా ప్రభుత్వం తీసుకుంది. కర్నూలు పరిధిలో ఓహెచ్‌ఎం(ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్) కోసం 11 గ్రామాల పరిధిలో 10,900 ఎకరాలను ఏపీఐఐసీ సేకరించింది. హైదరాబాద్–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా 'ఓహెచ్‌ఎం'ను 'నోడ్‌పాయింట్'గా కేంద్రం ప్రభుత్వం 2020 ఆగస్టులో నోటిఫై చేసింది. ఇందులో ఇప్పటికే జయరాజ్ ఇస్పాత్‌కు తొలివిడతలో 413.19 ఎకరాలు కేటాయించింది. రూ.2,938కోట్లతో జరుగుతోన్న ఈ స్టీల్‌ప్లాంటు పనులు చివరిదశలో ఉన్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 1060 ఉద్యోగాలు రానున్నాయి. పరోక్షంగా మరో 3వేల ఉద్యోగాలు రానున్నాయి. త్వరలోనే ఇది ప్రారంభం కానుంది.

ఇదిగో ఈ ఫొటోలోని ప్రాజెక్టు పేరు 'ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్‌ప్లాంటు'(ఏకీకృత పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు). కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని పిన్నాపురంలో రూ.15వేల కోట్లతో 'గ్రీన్‌కో' కంపెనీ నిర్మిస్తోంది. సింహభాగం పనులు పూర్తయ్యాయి. రాష్ట్రచరిత్రలో ఇంత పెట్టుబడితో నిర్మిస్తోన్న తొలిప్రాజెక్టు ఇదే. ప్రపంచంలో తొలి ఇంటిగ్రేటెడ్ పవర్‌ప్లాంటూ ఇదే. ప్లాంటు నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల ఉద్యోగాలు రానున్నాయి. 75శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలనే చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావడంతో 17,250 ఉద్యోగాలు స్థానికులకే దక్కనున్నాయి.



21 ప్రధాన కంపెనీల దరఖాస్తులు

ఓహెచ్‌ఎంలోని గుట్టపాడు క్లస్టర్‌లో 4,900 ఎకరాలు ఏపీఐఐసీ సేకరించింది. ఇందులో సిగాచీ ఇండస్ట్రీస్, ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్‌తో పాటు మారుతి–సుజుకి కూడా ఫార్మారంగంలో ప్రవేశించేందుకు భూముల కోసం ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకుంది. వీటితో పాటు మరో ఐదు ఫార్మాకంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. అలాగే ప్రైమోపాలీప్యాక్(ప్లాస్టిక్ ఇండస్ట్రీ), బ్లాక్‌హ్యాక్, ఎక్సెల్ ఇమ్యూన్ లాజిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్(వెటర్నరీ ఫార్మా) భారీ ఆక్సిజన్ తయారీ ప్లాంట్‌తో పాటు మరో 13 బడా కంపెనీలు కూడా త్వరలో నిర్మాణాలు చేపట్టబోతున్నాయి. 250 ఎకరాల్లో డీఆర్‌డీవో పనులు జరుగుతున్నాయి.

కర్నూలుపై ఫార్మా కంపెనీల దృష్టి

గుట్టపాడు క్లస్టర్‌లో ఫార్మాహబ్‌గా మారనుంది. హైదరాబాద్ కంటే కర్నూలులోని ఫార్మా అభివృద్ధికి అత్యంత అనుకూల వాతావరణం. అక్కడి కంటే ఇక్కడి పరిస్థితులు అన్ని రకాలుగా అనువుగా ఉండటంతో హైదరాబాద్ కంటే కర్నూలుపై కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. ఎయిర్‌పోర్టు ఉండటం, హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో ముంబై, ఢిల్లీ, బెంగళూరుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కంపెనీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు కర్నూలుకు వచ్చేందుకు ఎయిర్‌కనెక్టివిటీ కూడా దోహదం చేస్తుంది.

'గ్రీన్ ఎనర్జీ'తో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన కర్నూలు

ప్రపంచంలోని అతిపెద్ద 'ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్‌ప్లాంట్'తో కర్నూలు ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఆ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల ఉద్యోగాలు రానున్నాయి. ఈ ప్రాజెక్టు పరిశీలించేందుకు వచ్చే పలు కంపెనీలు ఇక్కడ మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో ఐరన్‌ఓర్, డోలమైట్, క్వార్జ్, సిలికాతో పాటు అత్యంత విలువైన ఖనిజ వనరులున్నాయి. వీటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంది.

జ్యుడీషియల్ సిటీ ఏర్పాటు దిశగా చర్యలు

జగన్నాథగట్టు ప్రాంతంలో హైకోర్టు నిర్మించి తీరుతామని ఆర్థికశాఖ మంత్రి బుగ్గనరాజేంద్రనాథరెడ్డి సీమగర్జనలో ప్రకటించారు. ఈ క్రమంలో అక్కడ జ్యుడీషియల్ సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. లోకాయుక్త, హెచ్‌ఆర్సీ, వక్ఫ్‌ట్రిబ్యునల్, ఏపీ ఈఆర్సీ అక్కడ నిర్మించనున్నారు. ఇవి కాకుండా ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, డెబ్స్ రికవరీ ట్రిబ్యునల్, క్యాట్(సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్), రైల్వే అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, ఏసీబీ కోర్టు, కో ఆపరేటివ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్. ఆంధ్రప్రదేశ్ రెగ్యులేటరీ కమిషన్, ఎండోమెంట్ ట్రిబ్యునల్‌తో పాటు 43 అనుబంధ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. దీంతో మినిస్టీరియల్ సిబ్బంది, న్యాయవాదులు, ఇతర ఉద్యోగులు 10వేల మందిదాకా కర్నూలుకు రానున్నారు.



లోకాయుక్త కార్యాలయం

మెడికల్ హబ్‌గా..

కర్నూలు కొన్నేళ్లుగా రాయలసీమకు మెడికల్ హబ్‌గా ఉంది. మెడికల్ కాలేజీ ఉండటంతో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు ఇక్కడ అందుతాయి. దీంతో కడప, అనంతపురం, కర్నూలు, తెలంగాణలోని మహబూబ్‌నగర్ వాసులు కర్నూలుపైనే ఇప్పటికీ ఆధారపడి ఉన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీతో పాటు విశ్వభారతి, శాంతిరాం మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఇవి కాకుండా ఆదోని, నంద్యాలలో మెడికల్ కాలేజీలను ప్రభుత్వం నిర్మిస్తోంది. దీంతో ఐదు మెడికల్ కాలేజీలతో ఉమ్మడి జిల్లా మెడికల్ హబ్‌గా మారే అవకాశం ఉంది.



నంద్యాల మెడికల్ కాలేజీ

కరువు రైతును ఆదుకోండి

- కేంద్ర బృంద సభ్యులకు విన్నవించిన ఎమ్మెల్యేలు
- సాయాన్ని మంజూరు చేయాలని కోరిన జేసీ
- కర్నూలు జిల్లాలో పర్యటించిన సెంట్రల్ టీమ్



కరువు పరిస్థితులను వివరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



పత్తికొండ మండలం జూటూరులో కంది పంటను చూపుతూ కరువు పరిస్థితిని కేంద్ర బృందం సభ్యులకు తెలుపుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కర్నూలు(అగ్రికల్చర్)/(సెంట్రల్)/కోడుమూరు/ఆస్పరి/పత్తికొండటౌన్/దేవనకొండ/ఆదోని రూరల్: వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర బృంద సభ్యులకు కోడుమూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు సుధాకర్, కంగాటి శ్రీదేవి విన్నవించారు. నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ బి.అనురాధ బట్నా, కేంద్ర తాగునీరు, శానిటేషన్ మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ అడ్వైజర్ ఆర్.సంతోష్, కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సెక్రటరీ సంగీత్‌కుమార్‌లతో కూడిన కేంద్ర బృంద సభ్యులు బుధవారం కర్నూలు జిల్లాలో పర్యటించారు. వానల్లేక ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి కరువు పరిస్థితులను తెలుసుకున్నారు.

- కోడుమూరు మండలం ప్యాలకుర్తిలో కేంద్ర బృంద సభ్యులకు కరువు పరిస్థితిని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నా ప్రకృతి సహకరించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించిందని, నష్టపోయిన పంటల జాబితాను కూడా సిద్ధం చేసిందన్నారు. కొన్ని గణాంకాలతో కర్నూలు రూరల్ మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించలేదని, ఇది రైతులకు తీరని వేదనను మిగిల్చిందన్నారు. కర్నూలు రూరల్ మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించి నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.
- పత్తికొండ మండలం చిన్నహుల్తి, జూటూరు గ్రామాల సమీపంలో పొలాలను సెంట్రల్ టీం సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర బృంద సభ్యులను కోరారు. తుగ్గలి మండలంలో వర్షాలు లేక పంటలు పండలేదని, ఈ మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలని కోరారు.
- దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, ఆస్పరి మండలం బిల్లేకల్లు, చిరుమాన్‌దొడ్డి గ్రామాల్లో రైతులు మాట్లాడుతూ.. వానల్లేక పది శాతం పంట కూడా చేతికి అందలేదని, ఆదుకోవాలని కోరారు. హెక్టారుకు ఉన్న పరిహారాన్ని రూ.17 వేల నుంచి రూ.25వేలకు పెంచాలని, దెబ్బతిన్న పంటలకు బీమా అమలు చేయాలని, నష్టపరిహారాన్ని త్వరగా ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు. ఉపాధి నిధులతో 5 ఎకరాలలోపు రైతులకే పండ్లతోటలు అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని, దీనిని 10 ఎకరాలకు పెంచాలని కోరారు.

సెంట్రల్ టీమ్ పర్యటించిన గ్రామాలు ఇవే..

మండలం	గ్రామాలు
పత్తికొండ	జూటూరు, చిన్నహుల్తి
ఆస్పరి	బిల్లేకల్, శంకరబండ
ఆదోని	విరుపాపురం
దేవనకొండ	కప్పట్రాళ్ల
కోడుమూరు	ప్యాలకుర్తి



కర్నూలు కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర బృంద సభ్యులు, చిత్రంలో జేసీ మౌర్య

- కేంద్ర బృంద సభ్యులు మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగుతో తక్కువ వర్షాలు పడినా దిగుబడి తీసుకోవచ్చన్నారు. ప్రతియేటా అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోయే బదులు ప్రత్యామ్నాయాలపై రైతులు దృష్టి సారించాలన్నారు. కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన అనంతరం అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ బట్నా మాట్లాడుతూ.. తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటలు పండక రైతులు నష్టపోయారన్నారు. పశువులకు గ్రాసం కొరత ఉందని, గ్రామంలోని అన్ని పశువులను ఒక్కచోట నిలిపి అక్కడే గడ్డిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటే మంచిదని సూచించారు. జిల్లాలో ముఖ్యంగా పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, మిరప, ఉల్లి, టమాట తదితర పంటలను సాగు చేసిన రైతులు నష్టపోయినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.
- జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. జిల్లాలో 26 మండలాలు ఉండగా 24 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు., మిగిలిన తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలను కూడా కరువుగా ప్రకటించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. వ్యవసాయ శాఖకు సంబంధించి 24 మండలాల్లో 2,90,741 మంది రైతులకు చెందిన 2,38,230.92 హెక్టార్లలో పంట నష్టం జరిగిందన్నారు. రైతులను ఆదుకోవడానికి ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద రూ.371 కోట్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద రూ.205.78 కోట్లను మంజూరు చేయాలని కోరారు. అలాగే ఉద్యాన శాఖకు సంబంధించి జిల్లాలోని 22 మండలాల్లో 57,365 మంది రైతులకు సంబంధించి 36,855.33 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో పరిహారం కోసం రూ.62.65 కోట్లను మంజూరు చేయాలన్నారు.
- సెంట్రల్ టీమ్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖరరెడ్డి, సివిల్ సప్లై డీఎం షర్మిల, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, డ్వామా పీడీ అమరనాథరెడ్డి, సీపీఓ హిమప్రభాకర్ రాజు, విపత్తుల నిర్వహణ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అనుపమ, ఉద్యాన శాఖ ఏడీ రామంజనేయులు, పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య, పత్తికొండ, కర్నూలు ఆర్డీవోలు రామలక్ష్మి, హరిప్రసాద్, ఏడీఏలు సాలురెడ్డి, బాలవర్ధిరాజు, విజయమోహన్‌కుమార్, ఏవోలు, తహసీల్దార్లు ఉన్నారు.

బంగారు నిక్షేపాలపై త్వరలో ఆస్పరిలో సర్వే

కర్నూలు (న్యూటౌన్): జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో త్వరలో ఆస్పరిలో బంగారం ఖనిజ నిక్షేపాలపై సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ 'సాక్షి'కి తెలిపారు. బుధవారం విజయవాడలోని గనులశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల గనుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. గనుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ దివేది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఖనిజ నిక్షేపాలపై చర్చ జరిగిందన్నారు. ఆస్పరిలో సర్వే నిర్వహించబోతున్నట్లు తెలిపారన్నారు. అలాగే అనంతపురం జిల్లా తాడిపత్రికి 12 కిలో మీటర్ల దూరంలో గ్యాస్ నిక్షేపాలపై ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో త్వరలో సర్వే జరగబోతుందని పేర్కొన్నారు.

మల్లన్నకు రూ.6.14 కోట్ల ఆదాయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉభయ ఆలయాల హుండీలలో కార్తీక మాసంలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు మాట్లాడుతూ ఆలయ హుండీల ద్వారా రూ.5,99,46,630, అన్నప్రసాద వితరణ హుండీల ద్వారా రూ.14,75,550 కలిపి మొత్తం రూ.6,14,22,180 నగదుతో పాటు 403.500 గ్రాముల బంగారం, 100.160 కేజీల వెండి, 1118 యుఎస్ఏ డాలర్లు, 130 యూఏఈ దిర్హమ్స్, 100 యూకే ఫౌండ్స్, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 22 మలేషియా రింగిట్స్, 20 కెనడా డాలర్లు, 19 సింగపూర్ డాలర్లు, 10 ఈరోస్ మొదలైన విదేశీ కరెన్సీ లభించిందన్నారు.



కానుకల లెక్కింపులో దేవస్థానం ఉద్యోగులు

తవ్వకాల్లో బయటపడిన పురాతన విగ్రహాలు

ప్యాపిలి: మండల కేంద్రమైన ప్యాపిలి కిందిగేరిలో కొద్ది రోజులుగా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బుధవారం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేసేందుకు కూలీలు పెద్ద గుంత తవ్వారు. తవ్వ కాల్లో పురాతన నంది విగ్రహం, నాగేంద్రుల విగ్రహాలు, కుమార స్వామి, వినాయకుడి విగ్రహాలు బయటపడ్డాయి. స్థానికులు అధిక సంఖ్యలో వచ్చి ఈ విగ్రహాలను ఆసక్తితో తిలకించారు.



తవ్వకాల్లో బయటపడిన కుమారస్వామి విగ్రహం

ఢిల్లీకి వెళ్లిన జిల్లా కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఢిల్లీకి వెళ్లారు. ఆమె అక్కడ 14, 15 తేదీల్లో జరిగే ఎన్నికల అధికారుల సమావేశంలో పాల్గొంటారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

క్లుప్తంగా

పెళ్లికి వెళ్తూ మృత్యువాత

- గుండెపోటుతో వ్యక్తి మృతి


గోసి వీరభద్ర (ఫైల్)

దేవనకొండ: పెళ్లి వెళ్తూ గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన దేవనకొండలో చోటుచేసుకుంది. కుంకనూరు గ్రామానికి చెందిన గోసి వీరభద్ర(40) దేవనకొండలో శ్రీరంగ కళ్యాణ మండపంలో శుక్రవారం జరగాల్సిన పెళ్లికి బైక్‌పై బయలుదేరాడు. దేవనకొండ బస్టాండు సమీపంలోకి రాగానే ఛాతీలో నొప్పి రావడంతో బైకును పక్కకు ఆపి నిలుచున్న చోటే కుప్పకూలి పడిపోయాడు. గమనించిన బైక్ వెనక ఉన్న వ్యక్తి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రజలు అక్కడికి చేరుకున్నారు. వెంటనే గోసి వీరభద్రను దేవనకొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని ధ్రువీకరించారు. దీంతో పెళ్లికి వచ్చిన బంధువులంతా కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వివాహిత బలవన్మరణం


మహాలక్ష్మి (ఫైల్)

కర్నూలు: నగరంలోని కొత్తపేటలోని రామాలయం దగ్గర నివాసముంటున్న బోయ మహాలక్ష్మి (19) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జూపాడుబంగ్లా మండలం తంగడంచె గ్రామానికి చెందిన ఈమె.. తల్లిదండ్రులు చనిపోవడంతో సాయిబాబా సంజీవ నగర్‌లో ఉంటున్న అవ్వ భవానమ్మ వద్ద పెరిగింది. కొత్తపేటకు చెందిన అబ్దుల్ గనిని ప్రేమించి రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వీరికి 8 నెలల కూతురు ఉంది. భర్త చికెన్ పకోడి బండి పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా వీరు నాలుగు నెలల క్రితం వేరు కాపురం పెట్టారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలతో మహాలక్ష్మి మనస్తాపం చెందింది. బుధవారం తెల్లవారుజామున పాపను తీసుకెళ్లి పాలు తీసుకురమ్మని పంపి తిరిగి వచ్చేలోగా ఇంట్లో కొక్కికి చీరతో ఉరి వేసుకుంది. భర్త వచ్చి గమనించి ఉరి నుంచి కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందింది. అవ్వ భవానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్‌ఐ ప్రేమ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎన్‌ఎం మృతి


మమత (ఫైల్)

కోడుమూరు: ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో కోడుమూరు గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంగా పని చేస్తున్న మమత (30) అనే మహిళ మంగళవారం రాత్రి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామానికి చెందిన మమత కోడుమూరు గ్రామ సచివాలయం–5లో ఏఎన్‌ఎంగా పనిచేస్తూ నాలుగు నెలల కిందట కుమారుడికి జన్మనివ్వడంతో మెటర్నరీ లీవ్‌లో ఉంది. నాలుగునెలల బాబుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో వైద్యం చేయించుకోవడం కోసం తల్లి సరస్వతితో కలిసి గోరంట్ల నుంచి ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలో వెంకటగిరి సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో తీవ్రంగా గాయపడింది. 108 వాహనంలో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలు మమతకు నాలుగు నెలల బాబుతో పాటు, రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భర్త వీరేంద్ర గోనెగండ్ల మండలంలోని గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ బుధవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మమత మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విద్యుత్ పొదుపు.. భవితకు వెలుగు!

- రోజురోజుకూ అధికమవుతున్న విద్యుత్ వాడకం
- ఉమ్మడి జిల్లాలో 16.50 లక్షల విద్యుత్ కనెక్షన్లు
- వీటి అవసరాలకు రోజుకు 1.80 కోట్ల యూనిట్లు సరఫరా
- అందులో 8 శాతం యూనిట్లు వివిధ కారణాలతో వృథా
- కొందరు అవగాహన లేమితో పాటించని విద్యుత్ పొదుపు
- ఫలితంగా బిల్లులపై ప్రభావం
- నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

కరెంటు లేకుండా పది నిమిషాలు కూడా ఉండలేం. అది ఇల్లు అయినా ప్రభుత్వ కార్యాలయమైనా, పరిశ్రమ అయినా ప్రతి పని విద్యుత్‌తో ముడి పడి ఉంటుంది. దీంతో విద్యుత్ వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. ఫలితంగా బిల్లులు అధికంగా రావడమే కాక పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. దీనిని కట్టడి చేసేందుకు వృథాను అరికట్టి విద్యుత్‌ను పొదుపుగా వాడాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తోంది.



కర్నూలు(రాజ్‌విహార్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16.50 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ వినియోగదారులు అత్యధికంగా 12.41 లక్షల కనెక్షన్లు ఉండగా వాణిజ్య వ్యాపారస్తులు 1.49 లక్షలు, వ్యవసాయ ఉచిత విద్యుత్ కనెక్షన్లు 2.18 లక్షలు, భారీ పరిశ్రమలు (హెచ్‌టీ) 678 ఉన్నాయి. ఉచిత విద్యుత్ యూనిట్లు మినహాయించి స్లాబ్, నాన్ స్లాబ్ కలిపి రోజుకు 1.80కోట్ల యూనిట్లు, నెలకు సుమారు 24.11 కోట్ల యూనిట్లు వాడుతున్నారు. ఇందులో 8శాతం వృథా (లైన్ లాస్) అవుతోంది. నెలకు రూ.240కోట్లు బిల్లుల చెల్లిస్తున్నారు.

రూ.18కి కొని.. రాయితీపై సరఫరా

ప్రభుత్వం ఒక విద్యుత్ యూనిట్‌ను రూ.18 చొప్పున కొనుగోలు చేసి, పేదలు, సామాన్యులకు రూ.1.50పైసల నుంచి రూ.5 వరకు వివిధ కేటగిరి, స్లాబ్‌ల మేరకు సరఫరా చేస్తోంది. మిగిలిన భారంతో పాటు వ్యవసాయ ఉచిత విద్యుత్ ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తోంది.

వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు గురువారం నుంచి 20వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. సబ్‌స్టేషన్లు, విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించి రైతులు, వినియోగదారులు, పారిశ్రామిక వేత్తలకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.

పక్కాగా మీటర్ కౌంటింగ్

విద్యుత్ శాఖ ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్ డిజిటల్ మీటర్స్ అతి చిన్న ఎల్‌ఈడీ లైటును వినియోగించినా లెక్కిస్తాయి. గతంలో ఉన్న మెకానికల్ మీటర్లు (చక్రం మీటర్లు)తొలగించి వాటిని ఏర్పాటు చేశారు. రిమోర్ట్‌తో ఆఫ్ చేసినా టీవీ, చార్జర్లకు ఉన్న ఎల్‌ఈడీ లైట్ల విద్యుత్ వాడకాన్ని కూడా అవి పరిగణలోకి తీసుకుంటాయి.

బిల్లు ఆదాకు మార్గాలు

- ఇళ్లలో సాధారంగా ఫిలమెంట్ (గుండ్రని ఎర్ర బల్బు) వాడరాదు. సీఎల్‌ఎఫ్, ఎల్‌ఈడీ బల్బులు వాడాలి.
- సీఎల్‌ఎఫ్, ఎల్‌ఈడీ బల్బుల వాడకంతో విద్యుత్ ఆదా, ఎక్కువ వెలుతురు, ఎక్కువ కాలం మన్నిక వస్తాయి.
- మూడు వాట్ల ఎల్‌ఈడీ బల్బు వెలుతురు 45 వాట్ల ఫిలమెంట్ బల్బుతో సమానంగా వెలుతురు ఇస్తుంది. ఇవి వాతావరణంలో కార్బన్‌ను విడుదల చేయవు.
- టీవీ చూశాక రిమోట్‌తో కాకుండా స్విచ్ ఆఫ్ చేయాలి. లేనిపక్షంలో ఎల్‌ఈడీ లైటు ఆన్‌లోనే ఉన్న కారణంగా డిజిటల్ మీటర్ యూనిట్లు కౌంట్ చేస్తూనే ఉంటుంది.
- ఐఎస్‌ఐ మార్కు ఉన్న గృహోపకరణాలు వాడాలి.
- కరెంటు స్టవ్, వాటర్ గ్రీజర్లకు బదులు గ్యాస్ హీటర్స్, కుక్కర్లు, బయో గ్యాస్ వినియోగించాలి.
- కంప్యూటర్లకు ఆర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. షట్ డౌన్ చేశాక స్విచ్‌లు ఆఫ్ చేయాలి.
- సహజంగా వచ్చే గాలి, వెలుతురును వినియోగించాలి.
- సెల్ ఫోన్ చార్జింగ్ అయ్యాక స్విచ్ ఆఫ్ చేయకపోతే చార్జర్‌లో ఉన్న ఎల్‌ఈడీ లైటుకూ విద్యుత్ కాలుతుంది.
- మిక్సీ, కూలర్, వాషింగ్ మిషన్, ఏసీ, షోకేజ్ ఐటమ్స్, ఇస్త్రీ పెట్టె, హోం థియేటర్, టీవీ, సౌండ్ సిస్టమ్స్, దోమల మిషన్లు అవసరం లేకపోతే స్విచ్ ఆఫ్ చేయాలి.

రైతులు చేపట్టాల్సిన జాగ్రత్తలు

- రైతులు ఉచిత విద్యుత్‌ను ఇతర అవసరాలకు వాడరాదు.
- మోటర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఐఎస్‌ఐ మార్కు మోటర్లు వినియోగిస్తే 20 శాతానికి పైగా విద్యుత్ ఆదా అవుతుంది
- పైపు లైన్లు వంపులు, బెండులు, వాల్వ్‌లు, జాయింట్లు ఎక్కువ లేకుండా చూడాలి.

పొదుపే మంత్రం



విద్యుత్‌ను పొదపుగా వాడుకోవాలి. ఇళ్లలో సీఎల్‌ఎఫ్, ఎల్‌ఈడీ బల్బులు వాడితే 40శాతం విద్యుత్ ఆదా అవుతుంది. అవసరం లేకుంటే స్విచ్ ఆఫ్ చేయాలి. గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం విద్యుత్ సరఫరా ఇస్తున్నాం. అనవసరంగా వినియోగిస్తే బిల్లులు రెట్టింపు వస్తాయి. అలాగే రైతులు ఉచిత విద్యుత్‌ను ఇతర అవసరాలకు వినియోగించరాదు.

– ఎం. ఉమాపతి, ఎస్‌ఈ, విద్యుత్ కర్నూలు.


హెచ్‌డబ్ల్యూఓస్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పీ సుంకన్న, నాగమద్దయ్య


పీ సుంకన్న, ఎం నాగమద్దయ్య, ఎం వెంకటరెడ్డి

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. బుధవారం స్థానిక అంబేగ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో సంఘం నూతన అధ్యక్షులుగా ఆర్‌ఎస్ పెండేకల్ హెచ్‌డబ్ల్యూఓ పీ సుంకన్న, ప్రధాన కార్యదర్శిగా ఆదోని కళాశాల బాలుర వసతి గృహ సంక్షేమాధికారి ఎం నాగమద్దయ్య ఎన్నికయ్యారు. అలాగే గౌరవాధ్యక్షులుగా కోడుమూరు, కర్నూలు హెచ్‌డబ్ల్యూఓలు జీ రాముడు, జీ సుంకన్న, కోశాధికారిగా కర్నూలు కళాశాల బాలుర వసతి గృహం –2 హెచ్‌డబ్ల్యూఓ ఎం వెంకటరెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహ సంక్షేమాధికారుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. త్వరలోనే జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో హెచ్‌డబ్ల్యూఓలు బెన్నమ్మ, వలి, మదారి, క్రాంతికుమార్, రమేష్, భారతీ, భవానీ, సిద్దప్ప, ఉస్మాన్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పసిపిల్లల్లో రెటినోపతి ప్రమాదకరం


మాట్లాడుతున్న డాక్టర్ విజయానందబాబు

కర్నూలు(హాస్పిటల్): పసిపిల్లల్లో వచ్చే రౌనోపతి ప్రమాదకరమైనదని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు చెప్పారు. రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ(ఆర్‌వోపీ)పై బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో చిన్నపిల్లల వైద్యులకు, ప్రాంతీయ కంటి ఆసుపత్రి వైద్యులకు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీల, నవజాత శిశు సంరక్షణ కేంద్రాల స్టాఫ్‌నర్సులు, నంద్యాల, ఆదోని, కర్నూలు డైస్ కేంద్రంలో పనిచేసే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ పసిపిల్లలు పైకి సాధారణంగా కనిపిస్తారని, రుగ్మతను సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే కంటిచూపు పోయే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయ కర్త హేమలత మాట్లాడుతూ.. కంటిచూపు లేకపోతే ప్రపంచాన్ని చూడలేమని, అందుకే దృష్టిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. కడపలోని పుష్పగిరి ఆసుపత్రికి చెందిన విట్రియోరెటినో కన్సల్టెంట్ డాక్టర్ బాల విద్యాధర్ మాట్లాడుతూ శిశువులలో వచ్చే దృష్టి లోపానికి రెటినోపతి కారణమన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సృజన, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, డెమో ప్రమీలమ్మ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

లింక్‌లను ఓపెన్ చేయొద్దు

- ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: న్యూఇయర్, క్రిస్మస్ గిఫ్టల పేరుతో మొబైళ్లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో హెచ్చరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు గిఫ్టల పేరుతో ఎరవేసి నగదు ఖాళీ చేస్తారని, అలాంటి వాటిపై అప్రమత్తంగా ఉడాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఉపాధ్యాయుడు బాషా

సంజామల: స్థానిక ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాషా రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపియ్యారు. ఆయనను బుధవారం హెచ్‌ఎం శ్రీహరి ప్రియానంద రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ 40 ప్లస్ క్యాటగిరిలో హైజంప్‌లో ప్రథమ స్థానం, షార్ట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, జావిలిన్‌త్రోలో తృతీయ స్థానంలో నిలిచి త్వరలో మహారాష్ట్రలోని పూణేలో జరగనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరం గ్రామానికి చెందిన నరసమ్మ(35) పాటుకు గురై మృతి చెందింది. మస్తులు తెలిపిన వివరాలు.. నరసమ్మ వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేది. బుధవారం తోటి కూలీలతో కలిసి ఆమె పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త నారదుడు, కుమారులు నాగరాజు, రాఘవేంద్ర ఉన్నారు.

సంక్షేమ బావుటా

జగనన్న పథకాలతో ఆర్థిక పరిస్థితి మెరుగు



మాది తుగ్గలి మండలం బాటతండా. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. భర్త రత్ననాయక్ నేను కలిసి కూలీ పనులకు పోయి బతుకుతున్నాం. జగనన్న వచ్చాక ఆయన ప్రవేశ పెట్టిన పథకాలు మా కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలిచాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పొదుపు రుణాలు మాఫీ చేశారు. ఇందిరమ్మ పొదుపు గ్రూపులో ఉన్న నాకు ఆసరా పథకం కింద మూడు విడతల్లో రూ.30 వేల మాఫీ సొమ్ము ఖాతాకు జమ చేశారు. వైఎస్సార్ చేయూత కింద రెండు విడతల్లో రూ.37,500 వచ్చింది. బ్యాంకు లింకేజీ కింద రూ.90 వేలు రుణం తీసుకున్నా. ఈ డబ్బుతో 14 పొట్టేళ్లు తీసుకొని మేపుకుంటున్నాం. ఇప్పుడు మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఆయన అమలు చేస్తున్న పథకాలు మాలాంటి వారికి చాలా ఉపయోగపడుతున్నాయి. – ఇస్లావత్ లక్ష్మీబాయి

పింఛన్ ఇంటికొస్తోంది



నాపేరు పుట్లూరు లక్ష్మీదేవి. భర్త నారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు, ముగ్గురు కూతుర్లకు పెళ్లిళ్లు చేశాను. వారు వేరు కాపురం ఉంటున్నారు. ఇప్పుడు నాది ఒంటరి జీవితం. నెల నెలా వచ్చే పింఛన్‌తోనే బతుకుతున్నా. గతంలో ఈ పింఛన్ కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రతినెల 1 వ తేదీనే వలంటీరు ఉషారాణి మా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందిస్తుంది. గత ఏడాది ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్ చేయించుకున్నా. ప్రభుత్వం ఇచ్చే రేషన్, పింఛన్‌తో జీవితం సాగుతుంది.

– పుట్లూరు లక్ష్మీదేవి

అద్దె బాధలు తప్పాయి



నాకు సొంతిల్లు లేకపోవడంతో నెలకు రూ.2 వేలు అద్దె చెల్లించలేక ఇబ్బందులకు గురయ్యాను. ప్రభుత్వం జగనన్న కాలనీలో 1.5 సెంటు స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేసింది. బిల్లులు రావన్న అనుమానంతో ఉండగా అధికారులు వచ్చి తప్పకుండా బిల్లులు మంజూరవుతాయని చెప్పడంతో నిర్మాణం ప్రారంభించాను. ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేయడంతో పాటు ఇసుక, ఐరన్ తదితర సామగ్రి సకాలంలో ఇవ్వడంతో నిర్మాణం పూర్తి చేసుకుని ఇప్పుడు కొత్త ఇంట్లోనే నివాసం ఉంటున్నాను. ప్రతి నెలా అద్దె చెల్లించాల్సిన బాధలు తప్పాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– చెవిటి శ్రీనివాసులు, ప్యాపిలి

ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది



నా భర్త మధు గనికార్మికుడు. నేను డ్వాక్రా సంఘంలో సభ్యురాలిని. నాకు ఒక కూతురు ఉంది. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండటంతో జీవనం కష్టంగా సాగేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక అమ్మ ఒడి పథకం ద్వారా నాకు మూడేళ్లలో రూ.40 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అయింది. రైతు భరోసా కింద మరో రూ.54,611 మొత్తం మా కుటుంబానికి రూ.94,611 లబ్ధి చేకూరింది. ఈ మొత్తంతో పాటు మరి కొంత బ్యాంకు లోను తీసుకుని ఇంట్లోనే చీరలు వ్యాపారం చేస్తూ నా భర్తకు చేదోడు వాదోడుగా ఉంటున్నాను. నా కూతురిని పదవ తరగతి ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి చదివిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాల వల్లే నా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

– సువర్ణ, రామక్రిష్ణాపురం, బనగానపల్లె

వివాహేతర సంబంధంతోనే హత్య


నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

- డీఎస్పీ వెంకటరామయ్య
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

శిరివెళ్ల: వివాహేతర సంబంధంతోనే యాళ్లూరు కుటికె బాలమద్దిలేటి హత్యకు గురయ్యాడని డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. బుధవారం నిందితులను అరెస్ట్ చేసి వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాలు.. కోటపాడుకు చెందిన సరస్వతి భర్త లక్ష్మీనరసింహుడు తొమ్మిదేళ్ల క్రితం మరణించడంతో పుట్టినిల్లు గోస్పాడు మండలం యాళ్లూరుకు వచ్చి జీవనం సాగిస్తూ ఉండేది. ఈక్రమంలో సమీప బంధువు కుటికె బాలమద్దిలేటి(52)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొంతకాలంగా బాలమద్దిలేటి మద్యం తాగి వేళాపాలా లేకుండా ఇంటికి వచ్చి శారీరక, మానసికంగా హింసించేవాడు. కాలనీలో కూడా న్యూసెన్స్ సృష్టించేవాడు. దీంతో అతన్ని అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకుని, తన అన్న, దమ్ముళ్లకు చెప్పింది. ఈనెల 7న రాత్రి మద్యం తాగి యథావిధిగా ఇంట్లోకి వచ్చిన బాలమద్దిలేటిని అప్పటికే ఇంట్లో మాటు వేసి ఉన్న మహిళ సోదరులు కుటికె శ్రీనివాసులు, వెంకటనారాయణ, వారి స్నేహితుడు తిమ్మరాజు చీరెతో చేసిన తాడును గొంతుకు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. సాక్ష్యాలను తుడిచి వేయడానికి మృతదేహాన్ని సమీపంలోని ఓ వరిగడ్డి వామి సందులో పడేసి వెళ్లిపోయారు. 2 రోజుల తర్వాత మృతదేహం నుంచి వాసన వస్తుండంతో విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీస్‌లు అక్కడికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలోనే నిందితులు భయపడి గ్రామ వీఆర్వో రసూల్ వద్ద లొంగిపోయారు. హత్యకు సంబంధించిన నలుగురిని అరెస్ట్ చేసి ఆళ్లగడ్డ కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ వంశీకృష్ణ, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

ఆడుదాం– ఆంధ్రాకు సై

- రేపటి నుంచి వచ్చేనెల 26 వరకు క్రీడాపోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ (ఫైల్)

గోస్పాడు: ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఆడుదాం–ఆంధ్ర పేరుతో ప్రభుత్వం నిర్వహించనున్న క్రీడా పోటీలకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఈనెల 15 నుంచి వచ్చే నెల (2024 జనవరి) 26 వరకు క్రీడా సంబరాలు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరగనున్నాయి. ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు.

గ్రామ, వార్డు స్థాయి నుంచి పోటీలు

వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఇవే కాకుండా క్రీడాకారులు ఆసక్తి చూపిస్తే యోగ, టెన్నికాయిట్, 3–కే, మారథాన్ గ్రామీణ సంప్రదాయ క్రీడలను నిర్వహిస్తారు. ఈ నెల 15 నుంచి 20 వరకు గ్రామ, వార్డు సచివాలయ స్థాయి, 21 నుంచి జనవరి 4 వరకు మండల, 5 నుంచి 10 వరకు నియోజకవర్గ, 11 నుంచి 21 వరకు జిల్లా, 22 నుంచి 26 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా కాంపిటేషన్‌లో పాల్గొనేందుకు 54,553 మంది, నాన్‌కాంపిటేటివ్స్‌లో పాల్గొనేందుకు 34,492 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాకు అందిన క్రీడా పరికరాలు..

బేసిక్ క్రికెట్ కిట్లు మెన్ 1,032, సర్టిఫికెట్స్ 2,394, బేసిక్ క్రికెట్ కిట్లు ఉమెన్ 516, బ్యాడ్మింటన్ నైలాన్ నెట్లు 516, వాలీబాల్ నెట్ 516, మెడల్స్ 2,394, ట్రోఫీలు 216, నైలాన్ షటిల్ కాక్స్ 1,548, ఫెదర్ షటిల్‌కాక్ 340, స్టేజ్–1 బ్యాడ్మింటన్ రాకెట్స్ 3,096, ఖోఖో యాంక్లెట్స్ 875, కబడ్డీ నీక్యాప్స్ 875, స్టేజ్–2 బ్యాడ్మింటన్ రాకెట్స్ 224, స్టేజ్–2 వాలీబాల్స్ 112, స్టేజ్–1 వాలీబాల్స్ 1,548, టెన్నికాయిట్స్ 1,032, స్టేజ్–2 ప్రొఫెషనల్ క్రికెట్ కిట్లు మెన్ 56, ప్రొఫెషనల్ క్రికెట్ కిట్లు 28, క్రికెట్ లెదర్ బాల్స్ 68 అందినట్లు అధికారులు తెలిపారు.

పేరు నమోదు చేసుకున్నా

15 ఏళ్ల పైబడిన వారికి కూడా పోటీలలో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వడంతో నేను కూడా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకున్నాను. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఆటల పోటీలు నిర్వహించలేదు. ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటం సంతోషకరం.

– ప్రసాద్, క్రీడాకారుడు, జిల్లెల్ల గ్రామం, గోస్పాడు(మం)

ఏర్పాట్లు చేశాం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆడుదాం – ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశాం. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఆట స్థలాల పరిశీలన పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా సంబరాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేస్తాం

– ఎంఎస్‌వీ రాజు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, నంద్యాల

పెళ్లి పత్రికలు పంచేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాణ్యం: తన సోదరి వివాహం దగ్గర పడడంతో పెళ్లి పత్రికలు పంచేందుకు వెళ్తూ ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన బలపనూరు మెట్ట జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల మండలం భీమవరం గ్రామానికి చెందిన మాడుగు కింగ్(35) నంద్యాలలోని ఆరోగ్య శ్రీ కేంద్రంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈయన సోదరి వివాహం ఈనెల 21న జరగాల్సి ఉంది. ఈ క్రమంలో బంధువులకు పెళ్లి పత్రికలు పంచేందుకు పాణ్యం మండలం బలపనూరు గ్రామానికి మరో వ్యక్తితో కలిసి మోటారు సైకిల్‌పై వెళ్లాడు. అక్కడి నుంచి రామతీర్థం గ్రామానికి బయలు దేరుతూ.. జాతీయ రహదారిపై యూటర్న్ వద్ద తిరుగుతున్న సమయంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వస్తున్న లారీ చూసి మోటారుసైకిల్‌పై ఉన్న వ్యక్తి దూకాడు. మాడుగుల కింగ్‌పై లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.


మృతి చెందిన మాడుగుల కింగ్

పర్యావరణం



శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి.
– లిసిప్రియ

నిండు సభలో... నిగ్గదీసి అడిగిన అగ్గిస్వరం

వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్-2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపుర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపుర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

> **నా నేరం ఏమిటి?**
> నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.
> – లిసిప్రియ, యాక్టివిస్ట్

> **యాక్ట్ నౌ**
> దుబాయ్‌లో జరిగిన క్లైమేట్ కాన్ఫరెన్స్-2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై, పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.
> 'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. దిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి దిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.

న్యూస్‌మేకర్
ఆషిక్



కుమారునికి వంట నేర్పితే?

ఏమవుతుంది?

బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి – 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.



తల్లితో ఆషిక్

ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదో నని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము–కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నిషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. అదెలా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కిచెన్‌టిప్స్

కరకరలాడాలంటే...

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



బ్యూటిప్స్ హెయిర్ కేర్

జుట్టుకు బలాన్నిచ్చే టానిక్

బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.



జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.





- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటె 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.



* హెల్త్ కేర్ నివేదిక

'రోల్' లేదు 'మోడల్' లేదు!

హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.

ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటెక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్‌ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్‌ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70–80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయులలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఇవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.